గిరిజన ఉపాధ్యాయ బదిలీల ఉత్తర్వులు సవరించాలి

- యుటిఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల కోసం ఇచ్చిన జిఓ 32ను వెంటనే సవరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాదు కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఈ నెల 17కు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారని, ఇది సాధ్యం కాదని తెలిపారు. మరో 10 రోజులు పొడిగించాలని వారు కోరారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు బదిలీల కోసం గతంలో ఇచ్చిన జిఓ 53ను అమలు చేయాలని, లేదా పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల కోసం రూపొందించిన నిబంధనలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

20వ తేదీలోపు ప్రవేశాలు పొందాలి

- గురుకుల విద్యాలయాల సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 38 సాధారణ, 12 మైనార్టీ పాఠశాలల్లో ఈ నెల 20వ తేదీలోపు ప్రవేశం పొందాలని సంస్థ కార్యదర్శి ఆర్ నరసింహారావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన వివరాలను విద్యార్థులకు ఎస్ఎంఎస్ రూపంలో పంపుతామని తెలిపారు. అన్ని ధ్రువపత్రాలనూ తీసుకుని విద్యార్థులు ప్రవేశం పొందాలన్నారు. మిగిలిన ఖాళీలకు 20వ తేదీ తరువాత మరో లిస్టు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

కోనసీమ సమస్యలు పరిష్కరించండి

క్రాప్ హాలిడే మండలాల్లో రైతు సంఘాల నాయకుల పర్యటన

ప్రజాశక్తి - అమలాపురం (కోనసీమ జిల్లా)

కోనసీమలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కేరళ తరహాలో వరికి మద్దతు ధరను ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. క్రాప్ హాలిడేకు పిలుపునిచ్చిన కోనసీమ జిల్లాలోని అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం మండలాల్లో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల నాయకుల బృందం మంగళవారం పర్యటించింది. రైతులు, కౌలు రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. వరికి కనీస మద్దతు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావట్లేదని, ఎకరాకు రూ.25 వేల వరకూ నష్టపోతున్నామని గోపవరంలో కౌలు రైతు ఉమామహేశ్వరరావు రైతు సంఘాల నాయకుల దృష్టికి తెచ్చారు. ఆర్‌బికెల ద్వారా ధాన్యం అమ్ముకోవాలంటే సవాలక్ష నిబంధనలు పెడుతున్నారని తెలిపారు. ఒకవేళ అమ్ముకున్నా అనుకున్న సమయానికి డబ్బులు ఇవ్వట్లేదని వాపోయారు. ఉప్పునీటి ఆక్వా చెరువుల వల్ల భూసారం తగ్గుతుందని, వాటిని తొలగించాలని పలువురు రైతులు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... క్రాప్ హాలిడే పరిష్కారం కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు.

గోపవరంలో కైలు రైతు ఉమామహేశ్వరరావుతో మాట్లాడుతున్న నాయకులు

కేరళ తరహాలో వరి రైతులకు క్వింటాలుకు రూ.2,800 మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డ్రెయిన్ల పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని, భూయజమానుల ప్రమేయం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి, రూ.25 వేల రుణ సదుపాయం బ్యాంకుల ద్వారా కల్పించాలని కోరారు. కొందరు భూస్వాములు క్రాప్ హాలిడే ద్వారా ఆ భూములన్నింటినీ ఆక్వా చెరువు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారని, ఆక్వా చెరువులపై నియంత్రణ విధించాలని తెలిపారు. ఉప్పు నీటి చెరువులన్నింటిని ధ్వంసం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం వల్ల రైతాంగానికి నష్టం వాటిల్లుతుందని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ బృందంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాశేఖర్, అమలాపురం డివిజన్ కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు ఉన్నారు.

నాన్ షెడ్యూల్ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి

- గిరిజన సంఘం పాదయాత్రలో సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని ఐదు పంచాయతీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చే వరకు గిరిజనులు ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను, షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని అనంతగిరి మండలం మర్రివలసలో గిరిజన సంఘం ఆధ్వర్యాన మంగళవారం పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను నర్సింగరావు ప్రారంభించి మాట్లాడారు. నాన్ షెడ్యూల్ ప్రాంతంలో షెడ్యూల్ పంచాయతీలు ఉండడం వల్ల అక్కడ గిరిజనులు కనీస సదుపాయాలు, సౌకర్యాలు, హక్కులకు నోచుకోలేకపోతున్నారని తెలిపారు. రహదారి సౌకర్యంలేక, సకాలంలో వైద్యం అందక మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, సాగులో ఉన్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని, జిలుగులపాడు బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మర్రివలసలో ప్రారంభమైన పాదయాత్ర నాన్ షెడ్యూల్‌లోని ఐదు పంచాయతీల పరిధిలోని 76 గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కిలో సురేంద్ర, మాజీ ఎంపిటిసి గంగులు, టోకురు సర్పంచ్ మొస్య, సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సర్కారు శాఖల్లో సిబ్బంది కుదింపు?

- ప్రారంభమైన రేషనలైజేషన్ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో రేషనలైజేషన్ కసరత్తు ప్రారంభమైంది. హేతుబద్ధత కోసం ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు చెబుతున్నప్పటికీ కొన్ని పోస్టులను రద్దు చేయడం, దిగువ స్థాయి ఉద్యోగులకు తొలగించడం వంటి చర్యలు కూడా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ పక్రియకు సంబంధించి అధయనం నెలాఖరులోగా పూర్తవుతుందని, త్వరలోనే కీలక నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు. వివిధ శాఖలు ఇప్పటికే ఆర్థికశాఖకు ఈ దిశలో అవసరమైన వివరాలు పంపినట్లు సమాచారం. గతంలో ప్రభుత్వం నుండి అందిన సర్క్యులర్ల ఆధారంగా పలు పత్రిపాదనలను వివిధ శాఖలు పంపాయి. సుమారుగా 15 శాఖల నుంచి ఈ ప్రతిపాదనలు ఆర్థికశాఖకు చేరగా, వాటిని క్రోడీకరించే పనిలో ఆ శాఖ ఉన్నట్లు తెలిసింది. వీటిల్లో రోడ్లు భవనాల శాఖ, పట్టణాభివృద్ధి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, చేనేత, గ్రామీణ నీటి సరఫరా వంటి శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ఆర్థికశాఖ కొన్ని సంశయాలు వ్యక్తం చేయగా, వాటిని తిరిగి పంపించేందుకు ఆయా శాఖలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇంకా మరికొన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని ఆర్థికశాఖ చెబుతోంది. శాఖల నుండి అందిన ప్రతిపాదనల్లో ప్రస్తుతం అవసరం లేని వంటూ కొన్ని పోస్టులను గుర్తించినట్టు సమాచారం. ఆ పోస్టులన్నీ రద్దు అయ్యే అవకాశం ఉందని సమాచారం. అలాగే నామమాత్రంగా పనులు ఉండే కొన్ని ఉద్యోగాలను కూడా గుర్తించారు.

సెల్‌ఫోన్ వెలుగులో వైద్యం

- బోరుభద్ర పిహెచ్‌సికి 15 రోజులుగా లేని కరెంట్

సెల్‌ఫోన్ వెలుగులో వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - సంతబొమ్మాళి (శ్రీకాకుళం)

పాముకాటుకు గురైన వ్యక్తికి సెల్‌ఫోన్ వెలుగులో చికిత్స చేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మేఘవరం పంచాయతీ సూరాడవానిపేటకు చెందిన సూరాడ ఆదినారాయణకు సోమవారం పాము కరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు బోరుభద్ర ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో కరెంట్ లేకపోవడంతో సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్ వెలుగులోనే రోగికి వైద్యం అందించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా ఆస్పత్రి ఆధునికీకరణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేయడంతో 15 రోజులుగా ఆస్పత్రిలో కరెంట్ నిలిచిపోయింది. దీంతో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యమ బాటలో ఆర్‌టిసి ఉద్యోగులు

- పిఆర్‌సిలో అన్యాయంపై ఏకమైన సంఘాలు
- 2 రోజుల నిరసనలు విజయవంతం
- మలి విడత పోరాటానికి సమాయత్తం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిఆర్‌సిని సమీక్షించాలని ఆర్‌టిసి ఉద్యోగులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు అంచెలంచెలుగా తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆర్‌టిసి ఉద్యోగులు చేపట్టిన ఉద్యమ కార్యాచరణకు పెద్దఎత్తున సంఘీభావం లభిస్తోంది. ఆర్‌టిసి కార్మికులందరనీ ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆర్‌టిసి కార్మిక సంఘాల స్థానంలో ఉద్యోగుల అసోసియేషన్లు ఏర్పడ్డాయి. ఉద్యోగులు సమ్మెలోకి పోవడం, ఆందోళన కార్యక్రమాలు వంటివి క్రమశిక్షణ చర్యల కిందకు వస్తాయని యాజమాన్యం, ప్రభుత్వం వైపు నుంచి బెదిరింపులకు పాల్పడుతుండటంతో విలీనం తర్వాత ప్రభుత్వం ఉద్యోగులకు నష్టం చేసే చర్యకు ఉపక్రమించినా.. ఉద్యోగ సంఘాలు నిరసనలు కూడా చేయలేని స్థితిలో కేవలం వినతిపత్రాలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం పిఆర్‌సి విషయంలో ఆర్‌టిసి ఉద్యోగులకు తీవ్రనష్టం కలిగించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులకు ఒక పిఆర్‌సిని ఎగ్గొట్టింది. అశుతోష్ మిశ్రా కమిటీ సిఫార్సులను బేఖాతరు చేస్తూ ఫిట్మెంటు, డిఎలలో కోతలు విధించడంతోపాటు డిఎలను, అలవెన్స్‌లను, హెచ్‌ఆర్‌ఎలను పూర్తిగా తగ్గించింది. ఉద్యోగుల కేటగిరిల విషయంలో, బదిలీల అంశంలో కూడా అసంబద్ధ నిర్ణయాలు తీసుకోవడంతో ఆర్‌టిసి ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మొదట ఎస్‌డబ్ల్యుఎఫ్ జిఓలు వచ్చిన వెంటనే అన్ని డిపోల ముందు నిరసనలకు ఇచ్చిన పిలుపునకు ఉద్యోగుల నుంచి పెద్దఎత్తున స్పందన రావడంతో ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలన్నీ ఉద్యమబాటకు నడుంబిగించాయి. ఇందులో భాగంగా ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక సమావేశమై ఈ నెల 13, 14 తేదీల్లో అన్ని డిపోల ముందు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశాయి. మొదటి రోజున రాష్ట్రంలోని అన్ని డిపోల ముందు ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన నిరసనలకు వచ్చిన అనూహ్య స్పందనకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. ఆర్‌టిసి ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వుల్లో మార్పులతో కొత్త జిఓలు ఇచ్చింది. మంగళవారం కూడా పెరిగిన ఛార్జీలకు అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్లకు ఇచ్చే ఇన్సెంటివ్‌లను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం కీలకమైన పిఆర్‌సి జిఓలు 113, 114ను సమీక్షించకపోవడంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆర్‌టిసి జెఎసి నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు చేపట్టిన నిరసనలు విజయవంతమయ్యాయని, ఇదే స్ఫూర్తితో పిఆర్‌సి జిఓలను ప్రభుత్వం సమీక్షించే వరకూ ఆందోళనలను దశలవారీగా ఉధృతం చేస్తామమని ఆర్‌టిసి జెఎసి నాయకులు తెలిపారు.

రజకులపై పెత్తందార్ల దాడి

- 11 మందికి తీవ్రగాయాలు..
- ఇద్దరి పరిస్థితి విషమం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజకులు

ప్రజాశక్తి-మార్కూరు రూరల్

ప్రకాశం జిల్లా మార్కూరులో మంగళవారం వేకువజామున రజకులపై పెత్తందారులు దాడి చేశారు.ఈ ఘటనలో 11మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల మేరకు.. మార్కూరు ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా జాతీయరహదారికి అనుకోని ఉన్న చాకలి మాన్యంలో సర్వే నంబర్ 603-సిలోని 4.50 ఎకరాల్లోని స్థలంపై పూర్తి హక్కులు తమవేనంటూ రజక సామాజికవర్గానికి చెందిన కుటుంబాలు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లతో అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. అయితే అంతకు ముందే అందులో నివాసం ఉంటున్న మరికొంతమంది స్థానికులు ఈ స్థలం తమకే చెందుతుందని తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను అధికారులకు చూపించడంతో రెండు గ్రూపుల మధ్య కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. రజక సామాజిక వర్గంలోని ఏడు కుటుంబాలకు చెందిన 40 మంది ఈ చాకలి మాన్యంలో ఆరు నెలలుగా తాత్కాలిక నివాసాలు ఏర్పరుచుకొని తమ కుటుంబాలతో నివసిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున సుమారు 30 మంది రౌడీలతో ఆరుబయట నిద్రపోతున్న రజకులపై పెత్తందారులు విచాక్షణారహితంగా దాడి చేశారు. 11 మంది తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ బాలికపై దాడి చేశారు. పారిపోతున్న ముగ్గురు రౌడీలను రజకులు అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. తీవ్రంగా గాయపడ్డ బెల్లంకొండ మణిబాబు, ముక్తిపాటి సాంబశివరావు, బెల్లంకొండ ప్రసాద్, ముక్తిపాటి సాయిబాబా, బెల్లంకొండ సుబ్బారావు, తొమ్మిదో తరగతి విద్యార్థిని ముక్తిపాటి శిరీషా, వృద్ధ దంపతులైన బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రేణుక, బండి శంకర్రావు, నరేంద్రను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో మణిబాబు, సాయిబాబా పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిరిండియాకు రూ.10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ : టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) భారీ షాక్ ఇచ్చింది. అకారణంగా ప్రయాణీకులను బోర్డింగ్‌కు నిరాకరించిన ఎయిరిండియాపై రెగ్యులేటరీ భారీ జరిమానా విధించింది. అర్హులైన ప్రయాణీకులను విమానం ఎక్కకుండా అక్రమంగా నిరోధించినందుకు గాను రూ. 10 లక్షల జరిమానా విధించింది. చెల్లుబాటు అయ్యే టికెట్లు కలిగి ఉన్నా ప్రయాణికులను బోర్డింగ్ నిరాకరించిన కారణంగా ఈ చర్యలు తీసుకున్నట్టు డిజిసిఎ వెల్లడించింది.

వారిది విషప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

చూపించమని సవాల్ విసిరితే ఇంతవరకు ఒక్కరినీ చూపించలేకపోయారని విమర్శించారు. కోనసీమకు అంబేద్కర్ పేరు పెడితే సహించలేని కొందరు అలజడులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. దళిత మంత్రి, బిసి ఎమ్మెల్యే ఇళ్లను తగలబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పది ఫలితాల్లో మనకంటే గుజరాత్ వెనుక

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది 67 శాతం మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా చూసినప్పుడు గుజరాత్‌లో 65 శాతమే ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. కొవిడ్ పరిస్థితులతో రెండేళ్లుగా విద్యార్థులు పరీక్షలు రాయలేదని...ఒక్క పరీక్ష కూడా రాయకుండానే గత రెండేళ్లుగా విద్యార్థులను పాస్ చేశామని గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఇవ్వగలమనే పరిస్థితుల్లో ఈ ఏడాది పది పరీక్షలు నిర్వహించామని..67 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫెయిలైన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు పెట్టి అందులో ఉత్తీర్ణులైన వారిని కంపార్టుమెంట్ అని కాకుండా రెగ్యులర్‌గా పాస్ అయినట్టు సర్టిఫికెట్లు ఇవ్వనున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం వాతావరణ బీమా మెగా చెక్కును ముఖ్యమంత్రి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరామ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపిలు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టోకు ధరలు తగ్గేదేలే..

- మేలో 15.88 శాతానికి ద్రవ్యోల్బణం
- నింగికంటిన అహారోత్పత్తుల ధరలు

న్యూఢిల్లీ : దేశంలో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) వరుసగా 14వ మాసంలోనూ ఎగిసిపడింది. ప్రస్తుత ఏడాది మేలో ఈ సూచీ ఏకంగా 15.88 శాతానికి చేరింది. ఇంతక్రితం ఏప్రిల్‌లో 15.08 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది కాలంగా ఈ సూచీ రెండంకెల స్థాయికి తగ్గకుండా నమోదు కావడం ఆందోళనకరం. కూరగాయలు, పళ్లు ధరలు మరింత పెరిగాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. "చమురు, సహజ వాయువు, ఇంధన, ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం కారణంగా గత మే నెలలో ద్రవ్యోల్బణం ఎగిసింది. మినరల్ ఆయిల్స్, ప్రాథమిక లోహాలు, ఆహారేతర వస్తువులు, రసాయనాలు, అహారోత్పత్తుల ధరలు మరింత పెరిగాయి." అని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. మరోవైపు మే నెలలో భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం (సిపిఐ) 7.04 శాతంగా చోటు చేసుకుంది. 2022-23 పూర్తి ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.7 శాతంగా నమోదు కావచ్చని ఆర్‌బిఐ ఇటీవలే పేర్కొంది. ఇంతక్రితం 5.6 శాతంగా అంచనా వేసింది. భారత చరిత్రలో తొలిసారి టోకు ద్రవ్యోల్బణం సూచీ 1991లో గరిష్టంగా 16.06 శాతంగా చోటు చేసుకుంది. 2012లో కొత్త సీరిస్‌లో డబ్ల్యుపిఐని గణించడం ప్రారంభించిన తర్వాత ఈ ఏడాది మేలో ఆల్‌టైం గరిష్ట స్థాయి 15.88 శాతంగా చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. అహారోత్పత్తుల ధరలు 12.34 శాతానికి పెరిగాయి. ఇంతక్రితం ఏప్రిల్‌లో ఇది 8.35 శాతంగా నమోదయ్యింది. క్రితం నెలో కూరగాయల ధరలు 56.36 శాతం పెరిగాయి. ఆలు, మాంసం, గ్రుడ్లు, చేపల ధరలు మరింత పెరిగాయి. ఇంధన ద్రవ్యోల్బణం సూచీ 40.62 శాతం, తయారీ ఉత్పత్తులు, చమురు గింజల ద్రవ్యోల్బణం వరుసగా 10.11 శాతం, 7.08 శాతంగా నమోదయ్యింది. ముడి చమురు మరియు సహజ వాయువు ద్రవ్యోల్బణం ఏకంగా 79.50 శాతంగా చోటు చేసుకుంది. ప్రభుత్వ విధానాల వల్ల ఇప్పట్లో ధరలు దిగి వచ్చే సంకేతాలు కానరావడం లేదని నిపుణులు భావిస్తున్నారు. దీంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోసారి వడ్డీ రేట్లను పెంచచడానికి అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

2023 ఆగస్టు నాటికి భూముల రీసర్వే పూర్తి

- సిఎం ప్రధాన సలహాదారుడు అజయ్‌కల్లం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పథకంలో భాగంగా 2023 ఆగస్టు నాటికి సర్వే పూర్తి చేయాలని సిఎం ప్రధాన సలహాదారుడు అజయ్‌కల్లాం తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క అధికారి సమర్థవంతంగా పనిచేసినప్పుడే లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. భూసర్వే ప్రాజెక్టుపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష కాకినాడ, కోనసీమ, ఏలూరు, తిరుపతి జిల్లాల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సిసిఎల్ఎ కమిషనరు సాయిప్రసాద్ మాట్లాడుతూ.. రీ సర్వే వెయ్యికి పైగా గ్రామాల్లో దాదాపు పూర్తయ్యిందని, తొలుత 51 గ్రామాల్లో, తదుపరి 572 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా, ఆయా గ్రామాల్లో పాత రికార్డుల స్థానంలో ట్యాపరింగుకు అవకాశం లేని కొత్త భూ రికార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతుల అభ్యంతరాలను పరిష్కరించి సరిహద్దులు నిర్ణయించామన్నారు. సర్వే సెటిల్‌మెంటు కమిషనరు సిద్ధార్థజైన్ మాట్లాడుతూ.. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో డిజిటలైజ్డ్ రెవెన్యూ రికార్డులు రూపొందాయని, ఫీల్డ్ మెజర్‌మెంట్‌బుక్ స్థానంలో భూ కమతాల మ్యాప్, ఆర్ఎస్ఆర్ స్థానంలో రీ సర్వే ల్యాండ్ రిజిస్టర్ తీసుకొచ్చామన్నారు. నూతనంగా 1-బి రిజిస్టర్, అడంగల్ రిజిస్టర్, రెవెన్యూ గ్రామ మ్యాప్‌లు రూపొందాయన్నారు. ఇందులో తాజా భూ యజమానుల వివరాలతో అన్ని నమోదయ్యాయన్నారు. ప్రతి ల్యాండ్ బిట్‌కు త్వరలో ఆధార్ తరహాలో ఒక విశేష గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నామన్నారు. మరో 100 గ్రామాల్లో రీసర్వే తుది దశకు చేరుకుందన్నారు.

ఆస్తి కోసం నానమ్మ, మేనత్త హత్య

- మేనల్లుడిపైనా దాడి
- ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఆస్తి వివాదంలో సొంత నానమ్మ, మేనత్తను దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం కృష్ణాజిల్లాలో జరిగింది. కృష్ణాజిల్లా గూడూరు మండలం పోసినవారిపాలెంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పెడన సిఐ వీరయ్యగౌడ్ కథనం మేరకు.. పోసినవారిపాలెం గ్రామానికి చెందిన పోసిన శాంతమ్మ (80)కు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. భర్తతో విభేదాల కారణంగా శాంతమ్మ కుమార్తె రూపవతి (45) తల్లి వద్దే ఉంటోంది. శాంతమ్మకు 1.30 ఎకరాల వ్యవసాయ భూమి, ఆరు సెంట్ల ఇంటి స్థలం ఉంది. పెద్దకుమారుడు ఇటీవల మరణించడంతో ఆస్తిని రెండు వాటాలుగా పంచాలని రెండో కుమారుడు సహదేవుడు తన తల్లిని కోరాడు. అయితే ఈ ఆస్తిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఆస్తి తమకు దక్కదని భావించిన సహదేవుడి కుమారులు సాంబశివరావు, మల్లేశ్వరరావు తమ నానమ్మ, మేనత్తను హతమార్చేందుకు సిద్ధమయ్యారు. పాలు తీసుకువస్తున్న మేనత్త రూపవతిపై కత్తులతో దాడి చేశారు. ఆ తర్వాత ఇంటి వద్ద ఉన్న శాంతమ్మపై దాడి చేశారు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. శాంతమ్మ పెద్దకుమారై కుమారుడు నాగరాజు పారిపోయేందుకు ప్రయత్నించగా..వెంటబడి గాయపరిచారు. హత్యకు గురైన శాంతమ్మ, రూపవతి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాజకీయ ఒత్తిళ్లతో రిపోర్టులో హంతకుల పేర్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ మచిలీపట్నం జిల్లా ఆస్పత్రి వద్ద నాగరాజు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. విచారణ పూర్తి చేసి నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసుకు సవరణ
సవరణ నెం.1, తేదీ: 09.06.2022 కు నిట్ నెం. 75 కు 86/ఎటిఓ/2022-23, తేదీ: 19.05.2022 నిట్ సంఖ్యలకు పరిపాలనాపరమైన కారణాలు మరియు సంకేతిక కారణాలు. ఇప్పుడు ఇలా సవరించబడింది: బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 16.06.2022 ముందుకు. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 25.06.2022 మ.3గం. ఇతర వివరాలకు ఇ-మార్కెట్ ప్లేస్ : www.apeprocurement.gov.in ను సందర్శించండి. ఫోన్ నెం.: 08812-22475 కు 860.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పిఆర్ఐ డివిజన్, ఏలూరు.
DIPR No: 4929/CL/ADVT/1/1/2021-22

ICICI Home Finance
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: ఐసిఐసి